నమస్తే తెలంగాణ
జగిత్యాల
10 | కరీంనగర్, బుధవారం 5 మార్చి 2025 | JAGTIAL

పట్టభద్రుల ఓట్లను లెక్కిస్తున్న సిబ్బంది

కొనసాగుతున్న కౌంటింగ్

- ఆధిక్యంలో బీజేపీ అభ్యర్థి
- ఫలితాలపై ఉత్కంఠ

కరీంనగర్ కలెక్టరేట్, మార్చి 4 : కరీంనగర్- ఆదిలాబాద్- నిజామాబాద్- మెదక్ ఉమ్మడి జిల్లాల శాసనమండలి పట్టభద్రుల ఎన్నిక ఓట్ల లెక్కింపు ఇంకా కొనసాగుతున్నది. మంగళవారం మధ్యాహ్నం నుంచి చెల్లుబాటయ్యే ఓట్ల లెక్కింపు ప్రారంభమైంది. మంగళవారం అర్ధరాత్రి 12 గంటల వరకు 6 రౌండ్లు ముగియగా, బీజేపీ అభ్యర్థి చిన్నమైల్ అంజిరెడ్డిదే ఆధిక్యం కనిపించింది. ఇప్పటివరకు 1.26 వేల ఓట్ల లెక్కింపు పూర్తికాగా, బీజేపీ అభ్యర్థికి 45,815 ఓట్లు, కాంగ్రెస్ అభ్యర్థి వీ నరేందర్‌రెడ్డికి 38,703, బీఎస్పీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణకు 32,103 ఓట్లు వచ్చాయి. 7,112 ఓట్ల ఆధిక్యతతో అంజిరెడ్డి ముందంజలో ఉన్నారు. సోమవారం ఉదయం మొదలైన ఈ ప్రక్రియ మంగళవారం మధ్యాహ్నం వరకు మొత్తం పోలైన ఓట్ల నుంచి చెల్లని, చెల్లుబాటయ్యే ఓట్ల విభజన పూర్తి చేశారు. అనంతరం మధ్యాహ్నం నుంచి చెల్లుబాటయ్యే ఓట్ల లెక్కింపు ప్రారంభించారు. పోస్టల్ బ్యాలెట్లతో కలిపి మొత్తం 2,52,100 ఓట్లు పోలు కాగా, వీటిలో 28 వేల వరకు చెల్లని ఓట్లు ఉన్నాయి. 2.24 లక్షల ఓట్లు చెల్లుబాటు కాగా, వీటిని లెక్కించేందుకు మొత్తం 21 టేబుళ్లు వినయోగిస్తున్నారు. ప్రతి రౌండ్‌కు 21 వేల ఓట్ల చొప్పున లెక్కిస్తుండగా, ఒక్కో రౌండ్ లెక్కింపునకు రెండు నుంచి రెండున్నర గంటల సమయం పడుతున్నది. నిరంతరాయంగా లెక్కింపు కొనసాగుతుండడంతో బుధవారం మధ్యాహ్నం వరకు ఫలితం తేలనుండగా, సర్వత్రా ఉత్కంఠ నెలకొన్నది.

సిరిసిల్ల మున్సిపల్ ఎదుట ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు, కార్మికులు

సీఎం సారూ.. మీ హామీలేమైనయ్

- సిరిసిల్లలో మున్సిపల్ కార్మికుల ధర్నా
- తమ డిమాండ్లు నెరవేర్చాలని విన్నపం

సిరిసిల్ల టౌన్, మార్చి 4: 'సీఎం రేవంత్‌రెడ్డి సారూ.. మా మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన హామీలు ఏమైనయ్. ఇంకెప్పుడు అమలు చేస్తరు' అంటూ సిరిసిల్ల మున్సిపల్ కార్మికులు ప్రశ్నించారు. వారం లోగా తమ సమస్యలు పరిష్కరించకుంటే సమ్మె చేస్తామని హెచ్చరించారు. మంగళవారం మున్సిపల్ ఆఫీస్ ఎదుట సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణతో కలిసి ధర్నా చేశారు. ఈ సందర్భంగా రమణ విలేకరులతో మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్వయంగా సీఎం రేవంత్‌రెడ్డి మున్సిపల్ శాఖ బాధ్యతలు చూస్తున్నప్పటికీ, కార్మికులకు ఇచ్చిన హామీని అమలు చేయడం లేదన్నారు. వెంటనే కార్మికులను పర్మినెంట్ చేసి కనీస వేతనం ₹26వేలు అందించాలని డిమాండ్ చేశారు. సిరిసిల్ల మున్సిపాలిటీకి సంబంధించి కార్మికుల పీఎఫ్, పీఆర్సీ, పెండింగ్ ఏరియర్స్, తదితర బకాయిలు దాదాపు ₹కోటి వరకు ఉన్నాయని, వెంటనే చెల్లించాలన్నారు. మున్సిపల్ కమిషనర్ స్పందించి కలెక్టర్ దృష్టికి సమస్యను తీసుకెళ్లి వారంలోగా పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేదంటే కార్మికులు అందరూ సమ్మె చేస్తారని హెచ్చరించారు. ఇక్కడ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు సుల్తాన్ నర్సయ్య, కాసారపు శంకర్, రాజయ్య, బాలయ్య, దేవరాజు, భారతవ్వ, బాబా కిషన్, లక్ష్మి, నర్సవ్వ, మల్లేశం, దేవయ్య, సురేష్, శ్రీనివాస్ ఉన్నారు.

అనుమతి లేని ల్యాబ్ సీజ్

జగిత్యాల, మార్చి 4 : జిల్లా కేంద్రంలో అనుమతి లేకుండా నిర్వహిస్తున్న ల్యాబొరేటరీలను జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి ప్రమోద్ కుమార్ కలెక్టర్ ఆదేశాల మేరకు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేసి, పాత బస్టాండ్ సమీపంలోని దుర్గా ల్యాబ్‌ను సీజ్ చేశారు. అలాగే, సమీపంలోని లక్ష్మీల్యాబ్ మూసి ఉండగా, వెంటనే రిజిస్ట్రేషన్ కోసం దరఖాస్తు చేసుకోవాలని ఫోన్ ద్వారా ఆదేశించారు. గడువు ముగిసిన తర్వాత దరఖాస్తు చేసుకుంటే, గడువు ముగిసిన తేదీ నుంచి దరఖాస్తు చేసుకొన్న తేదీ వరకు క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్ రూల్ 25 (1) ప్రకారం రోజుకు రూ.100 చొప్పున జరిమానా విధిస్తామని తెలిపారు.

మాట్లాడుతున్న బీఆర్ఎస్ సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య

రైతులకు నష్టపరిహారం ఇవ్వండి

- బీఆర్ఎస్ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య
- సాగునీటి విడుదలకు కృషి చేసిన కేటీఆర్‌కు ధన్యవాదాలు

సిరిసిల్ల టౌన్, మార్చి 4: సాగునీరు లేక పంట పొలాలు కండ్ల ముందే ఎండిపోతున్నాయని బీఆర్ఎస్ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య ఆందోళన వ్యక్తం చేశారు. పంటలకు నీళ్లిచ్చి కాపాడాలని, రైతులకు పంట నష్ట పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీసీ డిక్లరేషన్ సహా ఇచ్చిన ఏ ఒక్క హామీని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయలేదని విమర్శించారు. రాబోయే ఎన్నికలలో ప్రజా క్షేత్రంలో తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు. సిరిసిల్ల ప్రెస్ క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎల్లారెడ్డిపేట మండల పరిధిలోనే 475ఎకరాల వరకు పంట నష్టం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎండిన పంటలను పరిశీలించి రైతులను ఓదార్చారని, అదే సమయంలో నీటి పారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితోపాటు మిడ్ మానేరు ప్రాజెక్టు అధికారులు, ఇరిగేషన్ ఈఎన్సీతో ఫోన్‌లో మాట్లాడారని చెప్పారు. మిడ్‌మానేరు నుంచి మల్కపేట ద్వారా సింగసముద్రం వరకు, రంగనాయక సాగర్ నుంచి తంగళ్లపల్లి మండలం వరకు, మల్లన్నసాగర్, 12వ ప్యాకేజీ నుంచి ముస్తాబాద్ మండలం వరకు నీటిని చేయాలని అడిగారన్నారు. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పందించి సాగునీరు విడుదల చేయాలని ఆదేశించారని, అధికారులు సైతం నీటి విడుదలకు ఏర్పాట్లు చేసినట్టు తెలిసిందన్నారు. సాగు నీటి విడుదలకు కృషి చేసిన కేటీఆర్‌తోపాటు సహకరించిన అధికారులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కంటి తుడుపు చర్యలా కాకుండా 1.5 టీఎంసీ నీటిని మల్కపేట నుంచి సింగసముద్రంకు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో కేసీఆర్, కేటీఆర్ నాయకత్వంలో మిడ్‌మానేరు, రంగనాయకసాగర్, మల్లన్నసాగర్‌ను పూర్తి చేసుకున్నామని, మల్లన్నసాగర్ ద్వారా మండుటెండల్లోనూ కూడెల్లి వాగు ద్వారా అప్పర్‌మానేరును నింపుకొన్నామని గుర్తు చేశారు. దేశంలోనే అత్యంత నీచమైన భాషను వినియోగించే వ్యక్తి రేవంత్‌రెడ్డి అని విమర్శించారు. సిరిసిల్ల నేతలు విప్ ఆది శ్రీనివాస్, కేకే మహేందర్‌రెడ్డి సైతం అదే తరహాలో నీచంగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ప్రజలతో తిరస్కరించబడిన మహేందర్‌రెడ్డి ప్రతి సారీ ప్రజానాయకుడు కేటీఆర్‌ను విమర్శించడం సిగ్గుచేటన్నారు. అవాకులు, చెవాకులు పేలితే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు. జిల్లెల్లలో రైతు రాజిరెడ్డిని అక్రమ కేసు పెట్టి అరెస్ట్ చేయడం దుర్మార్గమైన చర్య అని మండిపడ్డారు. బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు దిడ్డి రాజు మాట్లాడుతూ.. కేకే మహేందర్‌రెడ్డి వారంలో మూడు రోజులు ప్రెస్‌మీట్‌లు పెట్టి కాలం వెల్లదీస్తున్నారని విమర్శించారు. ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని, వారి ఉపాధిపై దృష్టి సారించాలని సూచించారు. మరోసారి కేటీఆర్‌పై విమర్శలు చేస్తే సహించేదిలేదని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఆకునూరి శంకరయ్య, బీఆర్ఎస్ తంగళ్లపల్లి మండలాధ్యక్షుడు గజభీంకార్ రాజన్న, నాయకులు దార్ల సందీప్, మాట్ల మధు, సత్యనారాయణరెడ్డి, వెంగళ శ్రీనివాస్, కుంబాల మల్లారెడ్డి, బత్తుల రమేశ్, పోచవేని ఎల్లయ్య, ఎదురుగట్ల చంద్రయ్యగౌడ్, ప్రేమ్‌కుమార్, బింగి ఇజ్జగిరి, కొండ శంకర్, తదితరులు పాల్గొన్నారు.

బోరుమన్న ఊళ్లు

చింతకుంట, రాజారాంతండాల్లో బోరు బావుల వ్యథ

- గతేడాది వరకు పల్లెల్లో పుష్కలంగా భూగర్భజలాలు
- ఈ యేడాది వరద కాలువ, చెరువుల్లో నీళ్లు లేక మాయమైన ఊటలు
- నీళ్లు లేక కండ్ల ముందే ఎండుతున్న పంటలు
- కాపాడుకునేందుకు భగీరథ ప్రయత్నాలు
- మళ్లీ కొత్త బోర్లు వేయిస్తున్న రైతులు
- పదిహేను రోజుల్లోనే వందకుపైగా తవ్వకం.. 90 శాతం విఫలమే
- దాదాపు ₹70 లక్షలకు పైగా ఖర్చు చేసినా దక్కని ప్రయోజనం

ఐదారేండ్లుగా పుష్కలమైన చెరువు నీళ్లు, భూగర్భ జలాలతో బంగారు పంటలు పండించిన చింతకుంట, రాజారాంతండా మళ్లీ పదేళ్ల కిందటి పరిస్థితులను ఎదుర్కొంటున్నాయి. ప్రధాన ఆధారంగా ఉన్న చెరువు, వరదకాలువలోకి నీళ్లు రాకపోవడంతో సాగునీటికి తండ్లాడుతున్నాయి. పంటలను కాపాడుకునేందుకు భగీరథ ప్రయత్నం చేస్తున్నాయి. పదిహేను రోజుల్లో వందకు పైగా బోర్లు వేయిస్తే 90శాతం విఫలం కాగా, ఈ రెండు ఊర్లు 'బోరు'మంటున్నాయి. దాదాపు ₹70 లక్షలకు పైగా ఖర్చు చేసినా ప్రయోజనం దక్కకపోవడంతో పంటలను ఎలా కాపాడుకోవాలో తెలియక ఆందోళన చెందుతున్నాయి.

జగిత్యాల, మార్చి 4, (నమస్తే తెలంగాణ) / కథలాపూర్ : ఎస్సారెస్పీ తొలి ఫలాలను అందుకునే ప్రాంతం జగిత్యాల జిల్లా.. వరద కాలువ ఫలాలు సైతం అందుకునే తొలి జిల్లా కూడా ఇదే. అయితే, ఈ జిల్లాలోనూ కొన్ని నాన్ కమాండ్ మండలాలు ఉన్నాయి. కాకతీయ ప్రధాన కాలువతోపాటు వరద కాలువ ఆయా మండలాల నుంచే వెళ్తున్నా పెద్దగా ప్రయోజనం మాత్రం దక్కడం లేదు. మెట్‌పల్లి, కథలాపూర్, మేడిపల్లి, కొడిమ్యాల, మల్యాల మండలాలు నాన్ కమాండ్ ఏరియాలో ఉన్నాయి. ఈ మండలాల్లోని పంటలను సైతం సస్యశ్యామలం చేయాలన్న ఉద్దేశంతో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ వరద కాలువను బేస్ చేసుకొని ఎస్సారెస్పీ పునర్జీవ పథకాన్ని ప్రారంభించారు. వరద కాలువను ఏడాది పొడవునా ఒక్క టీఎంసీ నీటితో నింపి ఉంచే ప్రక్రియ మొదలు బెట్టారు. అలాగే, వరద కాలువకు తూములు పెట్టి, నాన్ ఆయకట్టు పరిధిలో ఉన్న మండలాల్లోని చెరువులను నింపే ప్రక్రియ చేపట్టారు. చెరువులను ఏడాది పొడవునా నింపి ఉంచడం, చెరువుల్లో నీళ్లు తగ్గితే మండు వేసవిలోనూ కాళేశ్వరం నుంచి నీటిని ఎత్తిపోసి, వరద కాలువ తూముల ద్వారా నింపే ప్రక్రియ కొనసాగించారు. వరద కాలువలో ఏడాది పొడవునా నీరు నిల్వ ఉండడం, తూముల ద్వారా చెరువులను నింపడంతో నాన్ ఆయకట్టు మండలాల్లోని గ్రామాల్లోనూ భూగర్భజలాలు పెరిగాయి. నాన్ ఆయకట్టు మండలాల్లో ఒకటైన కథలాపూర్ జిల్లాలోనే సాగు, తాగునీటికి తీవ్ర ఇబ్బందులు ఉన్న మండలంగా గుర్తింపు పొందింది. అలాంటి మండలం సైతం ఎస్సారెస్పీ పునర్జీవ పథకంతో తన దశను మార్చుకొని, సేద్యానికి అనుకూలమైన మండలంగా మారిపోయింది. భూగర్భజలాల మట్టం కూడా 2018 నుంచి క్రమంగా పెరుగుతూ వచ్చింది. అదే ఏడాది మార్చిలో మండలంలో 11.60 మీటర్ల లోతున భూగర్భజలాలు ఉండగా, 2020 మార్చిలో 3.75 మీటర్లపైకి నీటి ఊటలు వచ్చాయి. 2022లో 2.02 మీటర్ల లోతులోకి భూగర్భ నీటి మట్టం పెరిగింది. మండువేసవి అయిన ఏప్రిల్, మే నెలల్లో 2018లో 13.65 మీటర్ల లోతున జల ఊటలు ఉండగా, 2020లో 4.65 మీటర్ల పైకి, 2022లో 4.03 మీటర్ల పైకి నీటి ఊటలు చేరాయి. భూగర్భ జలాలు పెరగడంతో సాగు విస్తీర్ణం సైతం పెరిగిపోయింది. 2018లో కథలాపూర్ మండలంలో 7,975 ఎకరాల్లో పంటలు సాగు కాగా, 2022లో 11906 ఎకరాలకు చేరింది. మూడేండ్ల వ్యవధిలోనే ఒక్క కథలాపూర్ మండలంలోనే దాదాపు 4 వేల ఎకరాల సాగు విస్తీర్ణం పెరిగింది. పంట విస్తీర్ణం, దిగుబడి పెరగడంతో రైతులు ఆనందోత్సాహాలతో పొంగిపోయారు. అయితే, ఈ యేడాది పరిస్థితి మళ్లీ మొదటికి వచ్చింది. రైతులు తమ పంట పొలాలను కాపాడుకునేందుకు మళ్లీ బోరుబావులు వేసుకునే దుస్థితికి వచ్చారు. మండలంలోని చింతకుంట, రాజారాంతండా గ్రామాలకు చెందిన రైతులు పదిహేను రోజుల వ్యవధిలోనే వందకు పైగా బోర్లు వేసి, నీటి చుక్క జాడ కానరాక బిక్కముఖం వేసుకొని దిగాలుపడుతున్నారు.

నాలుగు బోర్లు వేసినా ఫలితం లేదు

నాలుగు బోర్లు వేసినం సార్. అయినా, నీళ్ల చుక్క పడలే. నాకు మొత్తం ఆరెకరాలు ఉంది. నాలుగెకరాల్లో వరి సాగు చేస్తున్న. మొన్నటి వరకు మొత్తం భూమి సాగు చేసిన. ఇప్పుడు పరిస్థితులు మంచిగా కనిపిస్తలేవని నాలుగెకరాల్లోనే వేసిన. పాత బోర్లలో నీళ్లు రాలే. దీంతో పంట కాపాడుకోవాలన్న ఆతృతతో నాలుగు బోర్లు వేయించిన. అయినా లాభం లేకుండ పోయింది. దాదాపు రూ.3 లక్షలు ఖర్చయినయ్. కానీ, నీటి చుక్క మాత్రం రాలే. 2019 నుంచి 2023 వరకు ఢోకా లేకుండా పంటలు పండినయ్. వరద కాలువల ఎప్పుడూ నీళ్లుండడం వల్ల మస్తు లాభమైంది. ఇప్పుడు వరద కాలువను నింపకపోవడంతో మా ఊళ్లె నీటి ఊటలు వస్తలేవ్. ఏదేమైనా మళ్లా మా కథలాపూర్ మండల రైతులకి కట్టపడే రోజులు వచ్చినయ్.

- పంచతి శంకర్, చింతకుంట (కథలాపూర్ మండలం)

రాజారాంతండా

రెండు పల్లెలు.. వందకుపైగా బోర్లు

కథలాపూర్ మండలంలో పెద్దగా నీటి వసతి లేని గ్రామం చింతకుంట. మొన్నటి వరకు రాజారాంతండా సైతం ఈ గ్రామ పరిధిలోనే ఉండేది. ఇటీవలే ప్రత్యేక గ్రామపంచాయతీగా ఏర్పాటైంది. చింతకుంటలో 2400 ఎకరాల సాగు భూమి ఉండగా, 2800 మంది జనాభా ఉన్నారు. అందులో దాదాపు 1500 మంది వ్యవసాయంపైనే ఆధారపడ్డారు. ఇక రాజారాంతండాలో 370 జనాభా ఉంది. ఇక్కడ 160 మంది రైతులు 500 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. ఈ రెండు గ్రామాలకు చింతకుంట గ్రామ చెరువే ఆధారం. అయితే, కాలువ ద్వారా ఈ చెరువు నింపుకునే అవకాశం లేదు. వర్షాలు పడినప్పుడే సహజంగా నిండాల్సిందే. అయితే, చింతకుంట, రాజారాంతండాకు సమీపంలో కలికోట సూరమ్మ చెరువు ఉంటుంది. అందులో నీళ్లున్నన్ని రోజులు ఈ రెండు గ్రామాల్లో నీటి ఊటలు పెరుగుతాయి. అలాగే, వరద కాలువ సైతం ఈ రెండు గ్రామాలకు సమీపంలోనే ఉంటుంది. అందులో ఏడాది పొడవునా నీటితో నింపినన్ని రోజులు రెండు గ్రామాల్లో భూగర్భజలాలతో బంగారు పంటలు పండాయి. అయితే, గతేడాది డిసెంబర్‌లో సూరమ్మ చెరువుకు గండిపడడంతో అందులో నీటి చుక్క లేకుండా పోయింది. నీటిని విడుదల చేసిన సమయంలో మాత్రమే వరద కాలువలో నెలలో మూడు నాలుగు రోజులు నీటి ప్రవాహం కనిపించింది. అటు వరద కాలువలో, ఇటు సూరమ్మ చెరువులో నీరు లేకపోవడంతో ఈ రెండు గ్రామాల్లో భూగర్భజలాలు అడుగంటి పోయాయి. ఈ క్రమంలో రైతులు తమ పంటలను కాపాడుకునేందుకు మళ్లీ కొత్తగా బోర్లను వేయడం మొదలు పెట్టారు. పది, పదిహేను రోజుల వ్యవధిలోనే రెండు గ్రామాల్లో వందకు పైగా బోర్లు వేశారు. అందులో కేవలం నాలుగైదింటిలో మాత్రమే కొద్దిమొత్తంలో నీళ్లు వచ్చాయి. 90కి పైగా బావులు వట్టిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. దాదాపు ₹70 లక్షలకు పైగా డబ్బులు ఖర్చుపెట్టి బోర్లు వేయించినా, ప్రయోజనం లేదని వాపోతున్నారు.

ఐదు బోర్లు వేసినా పాయిదా లేదు

పదెకరాల్లో ఎవుసం చేస్తా అని మొదలు పెట్టిన. నిరుడు, మోయడు లెక్కనే నీళ్లు అత్తయి. ఉన్న రెండు బోర్లు పనిచేస్తయని అనుకున్న. నారు పోసి ఎవుసం మొదలువెట్టినంక నీళ్లు అచ్చుడు బంద్ అయ్యింది. బోర్లు మొత్తం ఎండుకపోవుడు షురువైంది. నీళ్ల జాడ లేకపోవడంతో పదెకరాల పంట దెబ్బతినే పరిస్థితి కనిపించింది. పంటను కాపాడుకునేందుకు పది రోజులల్ల ఐదు బోర్లు వేసిన. అయినా పాయిదా లేకుండా పోయింది. దాదాపు మూడు లక్షల రూపాయల ఖర్చయింది. కానీ, నీటి చుక్క జాడ లేదు. ఈసారి మా తండా వాసుల పంటలు గంగల కలిసినట్లే అనిపిస్తుంది.

- లావుడ్యా రవీందర్‌నాయక్, రాజారాంతండా (కథలాపూర్ మండలం)

ఒక్క చుక్కా రాలే..

నేను ఆరెకరాల 29 గుంటల్లో వరి వేసిన. రెండెకరాలకే నీరు సరిపోతుంది. మిగతా నాలుగెకరాలకు సరిపోయే పరిస్థితి లేదు. పది రోజుల వ్యవధిలోనే మూడు బోర్లు వేయించిన. అయినా, ఒక్క చుక్క రాలే. రెండు బోర్లకు కేసింగ్ వేయిస్తే పనిచేస్తయ్ అంటే రెండింటికీ వేయించిన. అయినా చుక్క రాలే. పదేండ్ల కిందట మూడు బోర్లు వేయించిన. అందులో రెండు పడ్డయ్. ఎవుసం సాగింది. 2018 తర్వాత మా పొలాలకు నీటి ఇబ్బందులు రాలే. వరద కాలువ ఎప్పుడూ నిండుగా ఉండేది. దీనికి తోడు సూరమ్మ చెరువులో నీళ్లు ఉండడంతో భూగర్భజలాలు పెరిగినయ్. 2020 నుంచి నీటికి తిప్పలు రాలే. బోర్లు వేయాల్సిన అవసరం ఏర్పడలే. ఇప్పుడు మళ్లీ బోర్లు వేసుకోవాల్సిన దుస్థితి వచ్చింది. మా చింతకుంటతో పాటు పక్కనే ఉన్న రాజారాంతండాలో మస్తుమంది బోర్లు వేయిస్తున్నరు. అయినా ఒక్కదాంట్లో నీటి ఊట వస్తలేదు.. నాకు ఒక్కో బోరుకు ₹70 వేల చొప్పున ఇప్పటికే ₹2.10 లక్షలు ఖర్చయింది. అయినా, నీళ్లు పడలే. ఇక పడతయన్న నమ్మకం లేకుండా పోయింది. మళ్లీ మాకు తిప్పలు తప్పేలా లేవు.

- పోకతోట గంగాధర్, రైతు, చింతకుంట (కథలాపూర్ మండలం)

ఊటలు గంగల కలిసినయ్

నాకు ఏడెకరాలుంది. ఉన్న భూమి మొత్తం సాగు చేయాలని మొదలు వెట్టిన. అయితే, మధ్యలకు వచ్చినంక పంటకు నీళ్లు అందుడు బందయింది. ఏం చేయాలో అర్థం కాలే. ఎట్లన్న చేసి పంటను కాపాడుకోవాలని ఒక బోరు వేసిన. నీళ్లు పడలే.. అయినా ఆశతోటి మళ్లీ రెండు బోర్లు వేసిన. మూడు బోర్లలో చుక్క రాలే. ఏం చేయాలో అర్థం కావడం లేదు. మా ఊరు, మా పక్కన ఉన్న చింతకుంట రైతులు చింతకుంట చెరువుపై ఆధారపడే పంట సాగు చేస్తరు. ఆ చెరువులకు గూడ వానలు పడితేనే నీళ్లు వస్తయ్. మా ఊరి దగ్గరి నుంచే వరద కాలువ పోతున్నా మాకు నీళ్లు రావు.సూరమ్మ చెరువు, వరద కాలువను ఏడాది పొడువునా నింపి ఉంచితే మాత్రం మా ఊరి చెరువు నిండడంతోపాటు, మొత్తం ఊర్లళ్ల భూగర్భజలాలు పెరుగుతయ్. నాలుగైదేండ్లు మంచిగనే పంటలు పండించుకున్నం. ఇప్పుడు వరద కాలువ, సూరమ్మ చెరువుల నీళ్లు లేవు. మా ఊళ్లలో ఊటలు గంగల కలిసినయి.. బోర్లు పనికి రాకుండా పోయినయ్.. ఈ ఏడాది మా ఊరోళ్లం నిండా మునుగుడే.

- లకావత్ మురళి, రాజారాంతండా (కథలాపూర్ మండలం)

ముందుచూపుతోనే అభివృద్ధి

- ఓట్ల కోసం కాకుండా ప్రజల కోసమే పనిచేశాం
- నీళ్లన్నీ సముద్రంలో కలిపిన ఘనత కాంగ్రెస్‌దే
- మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్

మంథని రూరల్, మార్చి4 : ముందుచూపుతో మంథని నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసిన చరిత్ర బీఆర్ఎస్‌దేనని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ స్పష్టం చేశారు. కేసీఆర్ నాయకత్వంలో తాము ఓట్ల కోసం కాకుండా ప్రజల కోసమే పని చేశామని స్పష్టం చేశారు. కానీ, కాంగ్రెస్ ఏనాడూ వెలుగులు అందించాలనే ఆలోచన చేయలేదని, పైగా బద్నాం చేసే పనులు చేస్తున్నదని మండిపడ్డారు. ఎంతో విలువైన గోదావరి నీళ్లను సముద్రం పాలు చేసిన ఘనత కూడా ఆ పార్టీదేనని విమర్శించారు. మంగళవారం మంథని మండలం అడవిసోమన్ పల్లి గ్రామంలోని మానేరుపై నిర్మించిన చెక్ డ్యాంను సందర్శించి, అందులో చేపలు పడుతున్న మత్స్యకారులను కలిసి ఉపాధి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ గొప్పగా ఆలోచన చేసి మానేరువాగుపై అడవిసోమన్‌పల్లి గ్రామం వద్ద చెక్ డ్యాం నిర్మాణం చేపట్టారని, అయితే, దీనిపై అప్పుడు మంథని ఎమ్మెల్యేగా ఉన్న శ్రీధర్ బాబు రాద్ధాంతం చేశారని గుర్తు చేశారు. అయితే, ఈ చెక్‌డ్యాం వల్ల ప్రస్తుతం భూగర్భజలాలు పెరిగాయని, మత్స్యసంపదతో అనేక కుటుంబాలు ఉపాధి పొందుతున్నాయని వివరించారు. అనేక ఏండ్లు ఈ ప్రాంతాన్ని పాలించిన ప్రస్తుత మంత్రి కుటుంబం ఏనాడూ ఇక్కడి ప్రజల గురించి ఆలోచన చేయలేదన్నారు. ప్రస్తుతం చెక్ డ్యాం వల్ల జరుగుతున్న ప్రయోజనాలపై మంత్రి ఏం సమాధానం చెప్తారని ప్రశ్నించారు. ప్రజలను తప్పుదోవ పట్టించేలా మాట్లాడిన మంత్రి చెక్‌డ్యాంను చూసి తన తప్పు తెలుసుకొని ముక్కు నేలకు రాయాలని డిమాండ్ చేశారు. ఈ ప్రాంత ప్రజలపై చిత్తశుద్ధి ఉంటే కాళేశ్వరం ప్రాజెక్టును వినియోగంలోకి తీసుకురావాలన్నారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు ఏగోళపు శంకర్ గౌడ్, నాయకులు గట్టు శివ శంకర్, గట్టు జనార్దన్, నగునూరి శివ శంకర్ గౌడ్, కడారి సంపత్, డాక్టర్ మొగిళి, సమ్మయ్య, ననుబోతుల బాపు, మల్లేశ్ ఉన్నారు.

చేపలను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్

నేటి నుంచి ఇంటర్ పరీక్షలు

కమాన్‌చౌరస్తా, మార్చి 4 : సిరిసిల్ల ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. కరీంనగర్ జిల్లాలో మొదటి సంవత్సరం 17,799 మంది, రెండో సంవత్సరం 17,763 మంది విద్యార్థులు పరీక్ష రాయనుండగా, వీరి కోసం 58 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. జగిత్యాల జిల్లాలో మొదటి సంవత్సరం విద్యార్థులు 7073 మంది, రెండో సంవత్సరం విద్యార్థులు 7377 మంది పరీక్షలు రాయనుండగా వీరి కోసం 28 పరీక్షా కేంద్రాలను సిద్ధం చేశారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో మొదటి సంవత్సరం విద్యార్థులు 5065 మంది, ద్వితీయ సంవత్సరం 4245 మంది పరీక్షలు రాయనుండగా వీరి కోసం 16 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. పెద్దపల్లి జిల్లాలో ప్రథమ సంవత్సరం 4894 మంది, ద్వితీయ సంవత్సరం 5636 మంది పరీక్షలు రాయనుండగా వీరి కోసం 23 పరీక్షా కేంద్రాలు సిద్ధం చేశారు.